Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకులు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 49 • 20-11-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
దంతవైద్యశాల
సండేమార్కెట్ దగ్గర, పొగతోట, నెల్లూరు. సెల్: 99083 22007

లేజర్ చికిత్స
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

### జగన్ దూకుడుకు పగ్గమే

# సిబిఐ దర్యాప్తు!

ఓబుళాపురం గనుల అక్రమాలపై సిబిఐ దర్యాప్తు కోరడం ద్వారా జగన్ శిబిరానికి గట్టి హెచ్చరిక జారీ చేసింది కాంగ్రెస్ అధిష్ఠానం. సిబిఐ దర్యాప్తు తన స్వంత నిర్ణయమని ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఎంతగా చెప్తున్నప్పటికీ, అంత తీవ్ర నిర్ణయం తనకు తానుగా తీసుకొనే సాహసం ఆయనకు లేదని అందరికీ తెలుసు. కేంద్రస్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఇది జరిగిందన్నది బహిరంగ రహస్యం.

గాలి జనార్ధనరెడ్డి సోదరులు కర్నాటక ప్రభుత్వం ముక్కు పట్టుకొని మూడు చెరువుల నీళ్లు త్రాగించడం జాతీయస్థాయిలో సంచలనం రేపింది. రాజకీయపార్టీలు, నాయకులతో పాటు మేధావివర్గాలు కూడా ఈ పరిణామాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ రాజకీయాలు మైనింగ్ మాఫియా చేతులలో బందీకావడం ప్రజాస్వామ్యానికే అపచారమన్నది అందరి అభిప్రాయం. దేశ సంపదను చేజిక్కించుకొని, అక్రమంగా కోట్లు కూడేసుకొని, ఆ డబ్బు వెదజల్లి ఎమ్మెల్యేలను టోకున కొనుగోలు చేసి, ప్రభుత్వాలను పడగొట్టే స్థాయికి మాఫియా ముఠాలు పెరిగిపోవడాన్ని సహిస్తే, భవిష్యత్తులో పార్లమెంటుకు కూడా అదే దుర్గతి పడుతుందన్నది అందరి భయం. అందువల్లనే ఈ పోకడలను నివారించాలని సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, చిదంబరం వంటి అగ్రనేతల స్థాయిలో విస్తృతస్థాయి చర్చలు జరిగాయి.

గాలి సోదరులకు, వైఎస్‌జగన్‌కు వున్న మిత్రుత్వం, సాన్నిహిత్యం లోకానికంతా తెలుసు. ఆడుకొనే పిల్లవాడికి ఆట బొమ్మ కొనిచ్చినంత సులభంగా, ఏడుకోట్లు ఖర్చుపెట్టి, జగన్ తిరగడానికి ఆధునాతన బస్సు తయారుచేయించి, కానుకగా ఇచ్చారు వారు. వైఎస్ బ్రతికి వున్నప్పుడే బహిరంగంగా నడిచింది ఈ భాగోతం. ఓబుళాపురం గనుల అక్రమాల మీద వివాదం చెలరేగినప్పుడల్లా వైఎస్ స్వయంగా రంగంలోకి దిగి రక్షణ కల్పించేవాడు. గనులను సర్వే చేయించడానికి వచ్చిన కేంద్ర బృందాలను భయపెట్టి వెనక్కు పంపారు. మైనింగ్ శాఖను

కొరవ 14వ పేజీలో

### కార్టూన్ స్కేప్




## పిలవని పేరంటం

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రచారానికి జగన్‌ను ఆహ్వానించాలని ఆయన వర్గం మంత్రులు, ఎమ్మెల్యేలు కోరిన కోరికను నిర్ద్వందంగా తిరస్కరించాడు పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్. ఎమ్పీలు తమకు నచ్చిన చోట ప్రచారం చేసుకోవచ్చునని, ఒక ఎమ్పీని పిసిసి అధికారికంగా ఆహ్వానిస్తే అందరు ఎమ్పీలను అదే తీరులో పిలవాల్సి వస్తుందని, అది పార్టీకి ఇబ్బందులు సృష్టిస్తుందని చెప్పి తప్పించుకొన్నారాయన. ఏఐసిసి కార్యదర్శి కృష్ణమూర్తి, మునిసిపల్ ఎన్నికలకు కేంద్ర పరిశీలకుడు ప్రవీణ్‌థాపర్‌లు జగన్‌ను కలిసినప్పుడు ఈ ప్రస్తావన వచ్చింది. తనను పిసిసి పిలిస్తేనే ప్రచారానికి వస్తానని షరతు పెట్టాడు జగన్. కానీ డిఎస్ అందుకు అంగీకరించలేదు. ఆ వెంటనే జగన్‌కు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. అక్కడ ఎవరితో ఏమి మాట్లాడాడో తెలియదు కానీ, వచ్చీ రాగానే తాను ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నట్లు సాక్షి పత్రికలో ప్రకటన ఇచ్చాడు. ఒకరకంగా ఇది పిలవని పేరంటం క్రింద లెక్క కానీ కేంద్ర నాయకత్వంతో పేచీ ఎందుకనే ధోరణితో ఒక మెట్టు తగ్గాడు జగన్.

# గెలుపెవరిది?

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ఫలితం ఎట్లా వుండబోతుందన్న వూహాగానం తలలు పండిన రాజకీయ పరిశీలకులకు కూడా అంతుబట్టడం లేదు. అంత గందరగోళంగా జరుగుతున్నాయి ఆ ఎన్నికలు. మరొకప్రక్క వీటిపై హైదరాబాద్ నగర వాసుల అనాసక్తి అన్ని రాజకీయ పార్టీలను కలవరపరుస్తున్నది. అది ఏ పార్టీ సభ అయినా, ఎంత పెద్ద నాయకుడు ఉపన్యాసం చేస్తున్నాడని తెలిసినా జనం రావడం లేదు. చంద్రబాబు, డి.శ్రీనివాస్, రాఘవులు, జయప్రకాష్‌నారాయణ, దత్తాత్రేయ వంటి నేతల సభలన్నీ ఒకేరీతిలో సాగుతున్నాయి. ఏ సభకు కూడా జనం మూడు వందల మందికి మించి హాజరు కావడం లేదు. చిరంజీవి పరిస్థితి కొంత నయం. ఆయన వీధుల్లోకి వస్తే ఐదారు వందల మంది హాజరౌతున్నారు.

వైఎస్ బ్రతికి వుంటే ఈ ఎన్నికలు ఎంత వేడిగా, ఉద్రిక్తంగా జరిగేవో వూహించలేము. వీటి మీద చాలా పట్టుదలతో వుండినాడాయన. కానీ ఇప్పుడాయన లేడు. ఆ వేడి, ఉద్వేగాలు అసలే లేవు. చప్పగా, నీరసంగా నడుస్తున్నది ప్రచార పర్వం. రోజు కూలీకి తెచ్చిన జనంతో ప్రచారం చేసుకొంటున్నాయి అన్ని పార్టీలు. పెద్దగా ధన వ్యయం కూడా కనిపించడం లేదు. కాంగ్రెస్ పక్షాన కెవిపి రామచంద్రరావు అందరు అభ్యర్థులకు తనకు తోచిన సహాయం చేశాడని తెలుస్తున్నది. అభ్యర్థులతో తనకున్న సాన్నిహిత్యాన్ని బట్టి ఒక్కొక్కరికి రెండు నుంచి ఇరవై లక్షల రూపాయల వరకు ఇచ్చాడట. వైఎస్ బ్రతికి వుంటే కాంగ్రెస్ అభ్యర్థుల ఇంట ధనలక్ష్మి తాండవమాడి వుండేది. టిడిపితో సహా మరే పార్టీ కూడా అభ్యర్థులకు సొమ్ము మూటలు ఇవ్వడం లేదు. ఎవరి తంటాలు వారివిగా వున్నాయి.

ఈ ఎన్నికలలో పోలింగ్ శాతం చాలా తక్కువగా వుండబోతుందన్నది అందరి అంచనా. రంగంలో దాదాపు పది పార్టీలున్నాయి. హైదరాబాద్ నగర ఓటర్లలో అత్యధికులు వలస వచ్చినవారే. వారికి స్థానిక పరిస్థితులు,

కొరవ 14వ పేజీలో

షైన్
సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
హాస్పిటల్ ప్రత్యేకతలు
- పూర్తిగా/పాక్షికంగా కదులుతున్న పళ్ళతో బాధపడుతున్న వారికి అత్యాధునిక పద్ధతిలో ఫిక్స్‌డ్ పళ్ళు అమర్చుట.
- ఇంప్లాంటేషన్.
- ఎత్తుపళ్ళు, వంకరపళ్ళు సరిచేసే చికిత్స
- రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్.

డా॥ SK. మహమ్మద్ అలి
కాస్మటిక్ డెంటల్ సర్జన్
16-1064, హోటల్ వెంకటరమణ లైన్, పొగతోట, నెల్లూరు -524 001.
ఫోన్ : 0861 - 2340032



# [ యుద్ధం ఎవరి మీద? ]

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్సల్స్ అణచివేతకు సమర శంఖారావం పూరిస్తున్నాయి. శత్రుదేశం మీద యుద్ధం చేసే స్థాయిలో సన్నాహాలు చేస్తున్నాయి. వేలాది మంది పారామిలటరీ సైనికులు, అంతకు మూడింతల సంఖ్యలో పోలీసులు; కోబ్రా, గ్రేహౌండ్ వంటి ప్రత్యేక దళాలను రంగంలోకి దింపుతున్నాయి. ఛత్తీస్‌ఘడ్, ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలలోని అడవులను ముట్టడించబోతున్నాయి. ఆ అడవులలోని ప్రతి చెట్టును, పుట్టను, కొండను, కోనను, వాగును, వంకను జల్లెడపట్టి గాలిస్తామని భీకర ప్రకటనలు చేస్తున్నాయి. కేంద్ర హోంమంత్రి చిదంబరం ఈ యుద్ధాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఆయనకు పూర్తి అధికారాలు కట్టబెడుతున్నారు. దీనికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనే ముద్దుపేరు పెట్టుకొన్నారు. ప్రభుత్వం తమ మీద తలపెట్టిన ఈ దాడిని ఎదుర్కోవడానికి నక్సలైట్లు కూడా అంతేస్థాయిలో సన్నద్ధమౌతున్నారు. తమ శక్తియుక్తులన్నిటినీ సమీకరించి, పోరాటానికి సై అంటున్నారు.

నక్సల్ సమస్య ఈనాడు కొత్తగా తలెత్తింది కాదు. నలభై ఏళ్లకుపై నుంచి నలుగుతూనే వుంది. దాదాపు 14 రాష్ట్రాలలో పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ వారు విస్తరించి వున్నారు. కానీ ఏనాడు కూడా కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ అణచివేతకు చొరవ చూపలేదు. అది రాష్ట్రాలకు సంబంధించిన అంశంగా పరిగణిస్తూ వచ్చింది.

వున్నట్లుండి కేంద్రప్రభుత్వం ఈసమస్య మీద ఇంతగా దృష్టి పెట్టడానికి కారణం ఏమిటి? రాష్ట్రాలు నక్సల్స్ అణచివేతకు చేసే ప్రయత్నాలకు తోడ్పాటు అందించడం తప్ప తమకేమీ ఆసక్తి లేదని అమాయకంగా ప్రకటిస్తున్నాడు హోంమంత్రి చిదంబరం. కానీ ఆయన చెప్తున్నది పచ్చి అబద్ధం. ఐరన్‌ఓర్, బాక్సైట్, మాంగనీసు వంటి ఖనిజాలకు ఇటీవల కాలంలో విపరీతమైన విలువ వచ్చింది. బహుళజాతి సంస్థలు, బడా పారిశ్రామికవేత్తల కన్ను వీటిపై పడింది. ఈ ఖనిజ నిల్వలన్నీ ఒరిస్సా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘఢ్, ఆంధ్రప్రదేశ్‌లలోని అడవులలో నిక్షిప్తమై వున్నాయి. వాటిని వెలికి తీయాలంటే, ఆయా ప్రాంతాలలో నివాసం వుండే అమాయక గిరిజనుల జీవితాలను ఛిద్రం చేయాలి. దాన్ని గిరిజనులు ప్రతిఘటిస్తున్నారు. ప్రకృతిఒడిలో బ్రతికే తమకు, ఆ ప్రకృతి సంపదలో వాటా కావాలని కోరుతున్నారు. తమ జీవితాలను మెరుగుపరచడానికి ఆ నిధులను వాడాలని ఆందోళన చేస్తున్నారు. కొండలను, అడవులను నాశనం చేస్తే తమ బ్రతుకులు చిందరవందర అయిపోతాయని ఆక్రందిస్తున్నారు. నక్సల్స్ వారికి మద్దతు పలుకుతున్నారు. వారి పోరాటానికి దిశానిర్దేశం చేస్తున్నారు. నక్సలైట్‌లను అణిచివేయనిదే గిరిజన పోరాటాలు సమసిపోవు. అవి ఉపశమించకుంటే అడవులలోని లక్షలాది కోట్ల రూపాయల ఖనిజ సంపద కొల్లగొట్టడానికి పారిశ్రామికవేత్తలకు అవకాశం చిక్కదు.

పది, పదిహేను మంది పారిశ్రామికులను అపరకుబేరులుగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం లక్షలాది మంది గిరిజనుల మీద యుద్ధం ప్రకటిస్తున్నది. నెత్తుటి ఏర్లు ప్రవహింపచేయడానికి సిద్ధపడుతున్నది. పారిశ్రామిక అభివృద్ధికి ప్రకృతిసిద్ధమైన ఖనిజవనరులను వినియోగించడంలో తప్పు లేదు కానీ అది కొందరు వ్యక్తులు కోట్లకు పడగలెత్తేందుకు మాత్రమే ఉపయోగించడం ప్రభుత్వాలు చేయదగిన పనికాదు. ఖనిజాల విషయంలో ప్రభుత్వ విధానాలు ఏ ఫలితాలు ఇస్తున్నది గాలి జనార్దనరెడ్డి సోదరులను చూస్తే చాలు, అర్థమైపోతుంది. అటువంటి మాఫియా ముఠాల మేలు కోసం లక్షలాది మంది గిరిపుత్రుల మీద సైన్యాన్ని ప్రయోగించడం, తుపాకీ తూటాల వర్షం కురిపించడానికి సిద్ధం కావడం ప్రభుత్వం చేస్తున్న ఘోర అపరాధం. నక్సల్స్ ఏరివేత పేరిట జరుగుతున్న ఈ దుర్మార్గాన్ని తక్షణం నిలపడం కేంద్ర ప్రభుత్వ కర్తవ్యం. పారిశ్రామికవేత్తల మేలు కోసం చిదంబరం తన సైనిక శక్తిని ప్రయోగించదలిస్తే, దానివల్ల కలిగే పరిణామాలు చాలా చేదుగా వుంటాయన్నది నిజం.

## జనవాణి

### ఆదివాసీలపై దాడి

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒరిస్సా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలోని అడవుల్లో 75వేల మంది కేంద్ర పారామిలిటరీ బలగాలను తరలిస్తున్నాయి. దీన్ని మావోయిస్టుల బూచిగా చూపి ఆదివాసీలపై చేసే మానవ హననంగా అభివర్ణించవచ్చు. దేశంలోని కోట్లాదిమంది ఆదివాసులకు నిలవడానికి నేల, తలదాచుకోవడానికి నీడ, కట్టుకోవడానికి బట్టల్లేవు. తాగడానికి శుభ్రమైన నీళ్లు లేవు. చదువు, ఆరోగ్యం సంగతి ప్రభుత్వాలు అసలు పట్టించుకోలేదు. కానీ బడా పారిశ్రామిక వేత్తలు జిందాల్, మిట్టల్, టాటా, ఎస్సార్, వేదాంతలకు లక్షలాది ఎకరాల భూమిని ఖనిజ సంపదను తవ్వుకోవడానికి అనుమతులు మంజూరు చేశారు. వీరికోసం అడవుల్లో 7200 కోట్లు ఖర్చుపెట్టి రోడ్లు వేస్తున్నారు. నేతల కపటనీతిని ప్రజలు గమనించాలి.

పి.అరుణకుమారి, నెల్లూరు

### మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు!

బడీడు పిల్లలు బడికి రావాలనే సదుద్దేశ్యంతో నాటి తెలుగుదేశం ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగానే నడిపింది. దీని మూలంగా పాఠశాలలకు విద్యార్థులు వచ్చే శాతం పెరిగింది. కొత్త బడులు కట్టారు. విద్యార్థుల నిష్పత్తికి తోడుగా ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి. కానీ అంచెలంచెలుగా మధ్యాహ్న భోజన పథకానికి తూట్లు పొడుస్తున్నారు. తొమ్మిదేళ్ల క్రితం నాటి ధరలకు పావలా, అర్థ పెంచి వండిపెట్టే ఏజెన్సీలకు ఇస్తూ గుడ్లు ఉడికించి పెట్టమని, పౌష్టికాహారం ఇవ్వమని ప్రకటనలు చేస్తున్నారు. సమయానికి బిల్లులివ్వకుండా, రేట్లు పెంచకుండా ఈ పథకాన్ని ఒక పథకం ప్రకారం కనుమరుగయ్యేలా చేయడం ప్రభుత్వాలకు తగదు.

బి.సంధ్య, నెల్లూరు

### ఉప ఎన్నికల్లో చిత్ర విచిత్ర ఫలితాలు

గతవారం దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉపఎన్నికల్లో విచిత్ర ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో మమతాబెనర్జీ, మాయావతిలు మరింత పుంజుకొన్నారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

24-11-1939
పేజీలు : 16 వెల: అణా

### నెల్లూరు మునిసిపల్ దుష్పరిపాలన

ఉపాధ్యాయులకు కాజువల్ లీవు ఇచ్చుటలో చాలా అన్యాయం జరుగుచున్నది. ప్రతివానికి సంవత్సరానికి 15రోజులు సెలవు తీసుకొనుటకు హక్కు కలదు. మత సంబంధమగు కార్యాలు, శుభ, అశుభ కార్యాలు, శరీర జబ్బులు, బంధువుల ఇండ్లలో కార్యాలకు పోవుటకు ఈ సెలవులను వినియోగించుకొనవచ్చును. కాని మన మునిసిపాలిటీవారు ఈ క్రింది కారణాలకు కూడా సెలవులు నిరాకరించారు. ఇది చాలా అక్రమము.

1. తండ్రి మాసికము (చనిపోయిన తరువాత ప్రతి నెలపెట్టు తిథి) 2. బిడ్డ నామకరణము
3. బిడ్డకు గుణము తగులుట

### జిల్లా బోర్డు ప్రెసిడెంటు గారికి

నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలుకా వెంగంపల్లె గ్రామంలో పాఠశాల లేదు. చదుకోవలసిన పిల్లలు బోలెడు మంది వున్నారు. ఎన్ని అర్జీలిచ్చుకున్న మాకు అతీ గతీ లేదు. దయయుంచి మాకొక పాఠశాల దయ చేయించ ప్రార్థన.

- పౌరుడు

### చెర్లోపాళెం వార్తలు

పాలిచర్ల సుబ్బరామిరెడ్డి గారు తాము బీదలకు సాయం చేయకున్నా మానెగాని కాంగ్రెసునెందుకయ్యా అలా దూషిస్తావు?

### పూడిపర్తి వార్తలు

కోడూరు రాజగోపాలరెడ్డి గారి బండి తగులబెట్టిన కేసులో సఫరు 1-కి 50లు జుల్మానాబడగా ముద్దాయిలు అప్పీలు చేశారు. అప్పీలులో జుల్మానా 30రూపాయలకు తగ్గించారు. ఇందులో ముద్దాయిలుగా వున్న వెట్టివారిని డిస్మిస్ చేశారు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

20-11-1959
పేజీలు: 12 వెల: 0-3-0

### హృదయమున్న దొంగలు

ఇది పశ్చిమ బంగాళంలోని ఒక గ్రామంలో జరిగిన సంఘటన. ఒక వితంతువు జీవితమంతా కష్టపడి కడుపు కట్టుకొని రూ 500లు దాచి పెట్టుకొంది - తన 16 ఏండ్ల కుమార్తె పెండ్లికని.

ఒకనాడు తెల్లవారి లేచేసరికి పెట్టె తెరచి వుంది; జీవిత సర్వస్వమైన రూ 500లు అదృశ్యమై వున్నవి పాపం! ఇంకేముంది, ఆ నిర్భాగ్యురాలు తిండి నీరు మానేసి రోజంతా విలపించింది.

అకస్మాత్తుగా ఆనాటి సాయం కాలం ఒక ముఖం తెలియని వ్యక్తి వచ్చి, ఒక పొట్లాన్ని ఆమె కుమార్తె వద్ద యిచ్చి తల్లికి చేర్చమన్నాడు. ఆ పోట్లంలో పోయిన 500లతోపాటు ఒక చీటీ కూడా వుంది. అందులో యిలా వుంది-

"నేను దొంగను, కాని తండ్రిని గూడా. నీ వలెనే ఏదో ఒక రోజు పెండ్లి జేయవలసిన కుమార్తె ఒకతె నాకున్నది. అందువల్ల నీడబ్బు నీకు యిచ్చి వేస్తున్నాను".

### చిత్రజగత్

#### భలే ఛాన్సు

కుస్తీలు పట్టే బలం వుండి, లావుకు తగ్గ పొడగుండి, కన్నెమనస్సులను పరవశం చేసే అందం వుండి, కాస్తోకూస్తో ఇంగ్లీషు తెలిసిన అబ్బాయి లెవరైనా దొరుకుతారా అని ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్ సంస్థ ప్రపంచమంతా గాలిస్తుందట.

అటువంటి అబ్బాయి దొరికితే అతనికి, జాతి ఇదని, నటనలో అనుభవం లేదనీ కూడా సందేహించకుండా తను తీస్తున్న రెండున్నర కోట్ల రూపాయల సినిమా, 'ది కింగ్ మస్ట్ డై'లో నాయకుడి వేషం ఇస్తుంది. ఆ అదృష్టవంతుడి సినిమా లోకవిహారం ఆరంభమే తారాపథంలో జరుగుతుందన్న మాట.

# రైతును దెబ్బతీసిన వర్షాలు!

**జిల్లాలో వ్యవసాయపనులు మొదలైనవేళ కురిసిన వర్షాలకు నారుమళ్ళు, నాటువేసిన పొలాలు మునిగాయి. చెరువు కట్టలు తెగాయి. చేనేత కార్మికుల మగ్గాల్లో నీళ్లు వచ్చి చేరాయి. నష్టపోయిన రైతులు, చేనేత కార్మికులకు ఇంతవరకు సహాయం చేసినవారే లేరు.**



తోటపల్లిగూడూరు మండలం విలుకానిపల్లిలో దెబ్బతిన్న నారుమడి



పాపిరెడ్డిపాళెంలో నీటమునిగి దెబ్బతిన్న వరిపైరు.

జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా దాదాపు 50కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. చెరువులకు గండ్లు పడడం, కొన్ని కాలనీలు, వరినాట్లు, నారుమళ్లు నీట మునగడం, రోడ్లపైకి వర్షపునీరు చేరి రాకపోకలు స్థంభించడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. మరో రెండు రోజులపాటు జిల్లాలో భారీవర్షాలు పడివుంటే పలు గ్రామాలు నీటి దిగ్బంధంలో చిక్కుకునే ప్రమాదం ఏర్పడి వుండేది.

## అప్రమత్తంగా అధికారులు

అయితే ఈ దఫా జిల్లా అధికారయంత్రాంగం గతంలో కంటే కొంతమేర అప్రమత్తంగా వ్యవహరించిందని చెప్పాలి. ఇటీవల కర్నూలు జిల్లా వరదతాకిడికి అతలాకుతలమయ్యి తీవ్రనష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఈ సంఘటన దృష్టిలో వుంచుకొని ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారయంత్రాంగం సిద్ధపడింది. అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికి పంట నష్టాలను మాత్రం నివారించలేకపోయింది. రైతులు వేసిన వరినాట్లు, నారుమళ్లు పూర్తిగా నీటమునిగిపోయి కన్నీళ్లు మిగిల్చాయి.

భారీవర్షాల కారణంగా రైతులతోపాటు చేనేత కార్మికులకు సైతం అపారనష్టం కలిగింది. మగ్గాల్లోకి వర్షపునీరు చేరడంతో అవి పూర్తిగా పాడైపోయి తీవ్రనష్టం సంభవించింది. నష్టపోయిన నేతన్నలు కూడా ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. భారీ వర్షాల ప్రభావం జిల్లాలోని 33 మండలాల్లో వర్షాల ధాటికి 8 చిన్నతరహా చెరువులు దెబ్బతిన్నాయి. దాదాపు వెయ్యి హెక్టార్లలో వరిపైర్లకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు తయారుచేయగా, ఇది మరికొంత పెరిగే అవకాశం వుంది.

## దెబ్బతిన్న నారుమళ్లు

ఎనిమిది వేల ఎకరాల్లో నారుమళ్లు, మూడు వేల ఎకరాల్లో వరిపైరు, మరో రెండు వేల ఎకరాల్లో మినుము పంటకు నష్టం వాటిల్లిందని నివేదికలు తయారుచేయడం జరిగింది. ముఖ్యంగా పొదలకూరు, వెంకటాచలం, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, విడవలూరు, దగదర్తి, అల్లూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, మనుబోలు తదితర మండలాల్లో వరిపైర్లు భారీ వర్షాలకు నీటమునిగాయి. సైదాపురం మండలం గిద్దలూరు చెరువుకు భారీ గండిపడడంతో ఈ చెరువు క్రింద సాగులో వున్న దాదాపు 200 ఎకరాలలో వున్న నారుమళ్లు ముంపుకు గురై 80 లక్షలకుపైగా నష్టం జరిగింది.

అలాగే గూడూరు మండలం విందూరు, చెన్నూరు గ్రామాలలో 600 మందికి పైగా చేనేత కార్మికులు జీవిస్తున్నారు. వీరందరూ బట్టలునేసి జీవనం సాగించేవారే. అయితే భారీవర్షాలకు వర్షపునీరు మగ్గాల్లోకి చేరడంతో వున్న జీవనాధారం కోల్పోవాల్సి వచ్చిందని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ దఫా రైతులు అధికంగా జిలకర మసూరి విత్తనాలను కొనుగోలుచేసి నారుమళ్లు పోశారు. ఒక ఎకరాకు 60కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. బయట మార్కెట్లో 30 కిలోల బ్యాగు 800రూపాయలకు విక్రయిస్తున్నారు వ్యాపారులు. ఈ వంతున 60కిలోల విత్తనాలు 16వందల రూపాయల వంతున చిన్న, సన్నకారు రైతులు కొనుగోలు చేశారు.

ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా వరినాట్లు, వరి నారుమళ్లు దెబ్బతిన్న ప్రాంతాలలో "జమీన్‌రైతు" విలేకరుల బృందం పర్యటించి వివరాలు సేకరించడం జరిగింది. ఇందుకూరుపేట తోటపల్లి గూడూరు మండలాల్లోని కొరుటూరు, విలుకానిపల్లి, చింతోపు, పాపిరెడ్డిపాళెం తదితర ప్రాంతాలలో వరినారుమళ్లు దెబ్బతిని పూర్తిగా పనికిరాకుండా పోవడం కనిపించింది. వర్షపునీరు పొలంలో నుంచి బయటకు వెళ్లలేకపోవడంతో ఆయిల్‌ఇంజన్‌లు ఉపయోగించి నీటిని తోడేస్తున్నారు. జరిగిన నష్టాల గురించి తెలుసుకునేందుకు వ్యవసాయశాఖాధికారులు గ్రామాలకు వెళ్లలేదు.

వేలాది రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేసి నార్లు పోసుకుంటే అకాల వర్షంతో అవి దక్కకుండాపోయాయని, వర్షాలు నిలిచిపోయి వారం రోజులు గడిచినా కూడా అధికారులు పత్తాలేకుండాపోయారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొలాల్లోకి వెళ్లి రైతుల్ని కదిలిస్తే దెబ్బతిన్న వరినాట్లు, నారుమళ్లను చూపించి విలపిస్తున్న తీరు చూసేవారిని కలచివేస్తుంది. వర్షాల మూలంగా దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందిస్తారా లేదా అన్నది కూడా ఇంతవరకు ప్రజాప్రతినిధులు గాని, అధికారులు గాని ఎటువంటి ప్రకటన చేయకపోవడంపై అసహనం వ్యక్తమవుతుంది. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న వరినాట్ల వివరాలను సేకరించడం లేదని తెలుస్తుంది. కేవలం కార్యాలయంలో కూర్చొని తూతూమంత్రంగా నివేదికలు తయారు చేసినట్లుగా వుందే తప్ప వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం సరిపోవడం లేదు. జరిగిన నష్టాలకు, అధికారులు చెబుతున్న లెక్కలకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. ఏ ప్రాతిపదికన పంటనష్టాలను అంచనా వేశారో స్పష్టంగా చెప్పకపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు.

వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంతోపాటు సబ్సిడీపై వరివిత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ క్రమంలో వరినాట్లు దెబ్బతిన్న ప్రాంతాల రైతులు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.

### నష్టపరిహారం అందించాలి!



రెండెకరాల పొలంలో వరినాట్లు వేసేందుకు మూడు వేల రూపాయలు ఖర్చుచేసి జిలకరమసూరి విత్తనాలను కొనుగోలు చేయడం జరిగింది. నారుపోసి మరో నాలుగు రోజుల్లో వరినాట్లు వేద్దామనుకున్న సమయంలో భారీవర్షాలు రావడంతో మొత్తం నారు నీటమునిగి పనికిరాకుండా పోయింది. ఇప్పుడు మళ్లీ అప్పు చేసి విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

*బి. చిన్నయ్య, చింతోపు.*

### అధికారులు పత్తా లేరు



భారీవర్షాల కారణంగా వరినాట్లు దెబ్బతిన్న ప్రాంతాలలో వ్యవసాయశాఖ అధికారులు ఇంతవరకు పర్యటించలేదు. జరిగిన నష్టాలకు నష్టపరిహారం చెల్లిస్తే తిరిగి విత్తనాలను కొనుగోలు చేసి నార్లు పోసుకునే అవకాశం వుంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులకు పరిహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

*ఉదతా రాజయ్య, విలుకానిపల్లి*

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు




బాలల దినోత్సవం సందర్భంగా స్కూల్ విద్యార్థులకు నెల్లూరు తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో యూనిఫాంలు అందజేస్తున్న కవి ఉరిమిండి సుబ్రహ్మణ్యశాస్త్రి, కె. మురళీమోహన్‌రాజు.

# అసంపూర్తిగా చెరువుల మరమ్మత్తులు

ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన చెరువుల మరమ్మత్తు పనులు కాంట్రాక్టర్లకు, రైతులకు మధ్య తలెత్తిన వివాదం వల్ల అసంపూర్తిగా నిలిచిపోతున్నాయి. చెరువుల యాజమాన్య భాగస్వామ్యం క్రింద ఈ పనులను జిల్లాలో చేపట్టారు. పలు ప్రాంతాలలో కాంట్రాక్టర్ల వ్యవహార శైలిపై విభేదించిన రైతులు పనులు అడ్డుకోవడం దీనికి మరోకారణం. కావలి రూరల్ మండలంలోని పలు చెరువుల మరమ్మత్తు పనులకు ఇలాంటి ఆటంకాలే ఎదురౌతున్నాయి. గౌరవరం చెరువుకు సంబంధించి పాత తూముల స్థానంలో క్రొత్తవాటిని ఏర్పాటు చేయాల్సి వుండగా కాంట్రాక్టర్ దీనికి విరుద్ధంగా రెండింటి మధ్యలో తూములు ఏర్పాటుకు చెరువు కట్టను త్రవ్వడంతో రైతులు అడ్డుకొన్నారు. తుమ్మలపెంట చెరువు తూము పగులగొట్టి క్రొత్తదాన్ని నిర్మించే దశలో దాని లెవల్ పెంచడాన్ని ఇష్టపడని రైతులు పనులను అడ్డుకొన్నారు. చెన్నాయపాళెం చెరువుకట్ట పనులను నాసిరకంగా చేస్తుండడంతో సహించలేని రైతులు కాంట్రాక్టర్‌తో గొడవకు దిగడంతో ఆ పనులు నిలిచిపోయాయి. వర్షాకాలం

### కాంట్రాక్టర్లు - రైతుల మధ్య లడాయి

ప్రారంభంకావడం, గతవారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో తూము నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్ల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యంతో తమకు నష్టం వాటిల్లుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నెహ్రూ జయంతి సందర్భంగా నెల్లూరులోని ఆయన విగ్రహం వద్ద శాంతికపోతాన్ని ఎగరవేస్తున్న జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి.

# పంచాయితీ నిధుల స్వాహా!

### అడిగేవారే లేరు

గ్రామ పంచాయితీలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, నిధుల విడుదల, ఖర్చుపై తగిన పరిశీలన, తనిఖీలు వుండకపోవడంతో సర్పంచులు పంచాయితీ నిధులను దిగమింగేందుకు ఆస్కారం లభిస్తోంది. అధికారులు ఆడిట్ సక్రమంగా నిర్వహించకపోవడం కొందరు సర్పంచులకు అవకాశంగా మారింది. లెక్కాపక్కా లేకుండా అందినంత దోచుకొనేందుకు వీలుగా వుండడంతో జిల్లాలో గ్రామపంచాయితీల నిధులు గోల్మాల్ జరుగుతున్నాయి. ఇందుకు కావలి రూరల్ మండలం మద్దూరుపాడు పంచాయితీ ఒక ఉదాహరణ. సర్పంచ్ రావులపల్లి బాలకృష్ణ 12వ ఆర్థిక సంఘం నిధులు 2 లక్షలా 27వేలు, రాష్ట్ర నిధులు 56వేలు, ఎస్‌జిఆర్‌వై నిధులు లక్షా52వేలు, సాధారణ నిధులు 11లక్షలా 85వేలు మొత్తం 16లక్షల వరకు దిగమింగేశాడట. మూడు సంవత్సరాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా సర్పంచ్ పంచాయితీ నిధులు స్వాహా చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. కొందరు అధికారులకు ఇందులో వాటా వుండడంతో సర్పంచ్ ఇష్టానుసారం ప్రవర్తించాడు. గ్రామంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపారం కోసం వేసుకొన్న గ్రావెల్‌రోడ్డును సైతం పంచాయితీ నిధులతో వేసినట్లు చూపించి ఆ నిధులు దిగమింగాడట ఈ ఘనుడు. ఇటీవల సర్పంచ్‌పై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు విచారణ జరపడంతో ఈ నిధుల దుర్వినియోగం బట్టబయలైంది.



# అయ్యప్ప మాలధారణం నియమాల తోరణం!



శబరిగిరివాసుడు అయ్యప్పస్వామి మాల వేసుకోవడం అనేది దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కువగా కనబడుతుంది. మణికంఠుని స్మరిస్తూ వేసుకొనే మాల వలన సుఖ శాంతులు కల్గుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తుల నమ్మకం. అయ్యప్ప మాలధారణ నియమాల తోరణం. కఠిన బ్రహ్మచర్యం పాటిస్తూ నియమనిష్టలతో మండలం (41 రోజుల) పాటు హరిహరసుతుడిని భక్తితో కొలుస్తూ శబరిమల దర్శనం చేసుకోవడంతో దీక్ష ముగుస్తుంది. నల్లని వస్త్రాలు, తులసి, స్పటికమాలలను ధరించి, నుదుట చందనం, విబూది తిలకాన్ని పెట్టుకొని ఇంద్రియ నిగ్రహాన్ని పాటిస్తూ స్వామిశరణం అయ్యప్పా అని నిత్యం శరణం వేడుతూ దీక్షగా మసలుతూ కఠిననియమాలతో వుండడం అయ్యప్పమాలలో ముఖ్యమైనవి. ఒంటిపూట భోజనం చేస్తూ, మితాహారం తీసుకొంటూ, చల్లని నీటితో మూడుపూటలా స్నానం చేసి ఆహారాన్ని తీసుకోవడం జరుగుతుంది. దీన్ని భిక్ష అంటారు. కోరికలను త్యజించి, మనసును దైవ చింతనవైపు మరల్చడం ద్వారా కామక్రోధాల నుంచి విముక్తులై బ్రహ్మచర్యం పాటించడం వలన మానసిక, శారీరక స్వాంతన లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. దీక్షాకాలంలో నల్లని వస్త్రాలను కట్టుకొని, పాదరక్షలు లేకుండా తిరగడం, ఎవరైనా ఎదురుపడితే స్వామి అని సంబోధిస్తూ మెలగడం వలన పేద, ధనిక అనే తారతమ్యాలు తొలగి అందరు సమానమనే భావన అయ్యప్పమాల వలన కల్గుతుంది.

అయ్యప్ప శరణు ఘోషతో త్రికాల పూజలలో వుండే స్వాములు అయ్యప్పకు ప్రీతికరమైన అరటి బోదెలతో 18 మెట్లు నిర్మించి మెట్ల పూజ చేస్తారు. మండల కాలం అయిన తర్వాత ఇరుముడి కట్టుకొని, నెత్తిన పెట్టుకొని శబరిమలకు పోయి 18మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించి దీక్షను విరమిస్తారు.

అయ్యప్పమాల ధరించడం వలన శని బాధల నుండి విముక్తి లభిస్తుందని, వారి దరికి శని చేరదని పురాణం కథనం. కార్తీక మాసంలో ఈ మాలను అధికసంఖ్యలో ధరిస్తుంటారు. ప్రతి ఏడాది మకర సంక్రమణ నాడు శబరిగిరిపై మకరజ్యోతిగా స్వామి దర్శనమిస్తుండడంతో జ్యోతి దర్శనానికి వెళ్లే వారి సంఖ్య అధికంగా వుంటున్నది.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### మా బావ కుళ్లుబోతు



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని కలసి ఆశీర్వచనం కోరడాన్ని ప్రసన్న బావ జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓర్చుకోలేకపోయారు. నేదురుమల్లిని కలసి కుటుంబ పరువు తీశాడని, రాజకీయ వ్యభిచారిగా ప్రసన్న మారాడని విమర్శించాడు. దీనిని సీరియస్‌గా తీసుకొన్న ప్రసన్న ఘాటుగానే స్పందించాడు. రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయి మా బావకు మతిభ్రమించింది. నేను సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, చిరంజీవి, బాలకృష్ణలలో ఎవరినైనా కలుస్తా. ఆయన ఎదుటివారు బాగుంటే ఓర్వలేడు. ఒట్టి కుళ్లుబోతు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఆయన వల్లే నాశనమయ్యిందని తన కడుపులో బాధను వెళ్లగక్కాడు.

### యుగాంతం భయం!



జనంలో ఈమధ్య భక్తి భావనలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి కారణం ఏమిటో కాలజ్ఞాని వీర బ్రహ్మేంద్రస్వామి చెప్పాలి. దీనికి తోడు ఈ వారంలో విడుదలైన 2012 సినిమా జనాల్లో యుగాంతం గూర్చి విపరీతంగా చర్చించుకోనేలా చేస్తుంది. యుగాంతాన్ని ఈ సినిమాలో ఏవిధంగా చూపారన్నది చూడను నెల్లూరు జనం ఎగబడుతున్నారు. దీంతో ఎప్పుడూ లేనట్లుగా ఇంగ్లీషు సినిమాకు వారం రోజుల ముందుగానే టిక్కెట్ల అడ్వాన్స్ బుకింగ్ జరిగిపోయింది.

### ఇందిరా x రాజీవ్

ఇదేమిటి స్వర్గస్తులైన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల మధ్య తగాదా అనుకొనేరు. వాళ్ల మధ్య ఏం గొడవలు లేకున్నా నెల్లూరులో కాంగ్రెస్‌పార్టీ ఆఫీసుగా చాలారోజులనుంచి చలామణి అవుతున్న ఇందిరాభవన్ ఈ మధ్య కొత్తగా పెట్టిన రాజీవ్‌భవన్‌లు రాజకీయ విభేదాల కేంద్రాలుగా



జనం నోళ్లలో నానుతున్నాయి. స్వపక్షంలో విపక్షంలా ఆనం కుటుంబీకులు, వారు బోయీలై పల్లకి మోస్తున్న మేయర్ భానుశ్రీలతోపాటు ప్రతిపక్షం తెలుగుదేశంపార్టీపై సైతం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుతూ అప్రతిహతంగా రాజీవ్‌భవన్ ముందుకు దూసుకపోతుంది.

### సిఎం మెహర్బానీ కోసం...



నెల్లూరు రాజకీయాల్లో విలక్షణుడు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ఇటీవల వరకు జగన్‌ను ముఖ్యమంత్రి చేయకపోతే రాజీనామా చేస్తానని, రాష్ట్రంలో అల్లకల్లోలం జరుగుతుందని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికిన ఆయన పనిలో పనిగా రోశయ్యను సైతం ఏకవచన సంబోధన ప్రయోగం చేసిన వ్యక్తి. అటువంటి వ్యక్తి హఠాత్తుగా మారిపోయాడు. నెల్లూరులో మెజార్టీ సంఖ్యలో వున్న వైశ్యుల ఆస్తుల పరిరక్షకునిగా మారారు. దర్గామిట్టలో కోట్లరూపాయల విలువ చేసే వివాదాస్పద వేమాల శెట్టి బావి స్థలంలో వైశ్యుల కులదేవత కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి స్వయంగా తానే శంకుస్థాపన చేశారు. వివేకాను అడ్డుకోలేక కలెక్టర్, ఎస్పీలు ఈ వ్యవహారాన్ని చూస్తూ ఊరుకొన్నారు. ఈ గొడవను సాకుగా చూపి వందలాదిమంది నెల్లూరు ఆర్యవైశ్యులతో ముఖ్యమంత్రి రోశయ్య వద్దకు రాయబారం నడపాలని, ఆయన చల్లని చూపులు తనపై ప్రసరించేలా చేసుకోను మొత్తం మీద వివేకా పెద్ద పథక రచనే చేశాడు.

### ఆదాల గరంగరం



సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు ఉప్పు, నిప్పులే. గతవారంలో ఆదాలను ప్రెస్‌మీట్ పెట్టి సోమిరెడ్డి నోరారతిట్టారు. దీన్ని తట్టుకోలేకపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి వచ్చి అక్కడ నుంచి నేరుగా నెల్లూరు వచ్చి విలేకరుల సమావేశం పెట్టి మరీ చంద్రమోహన్‌రెడ్డిని దులపరించేశాడు. నేనిచ్చిన డబ్బుతో కట్టిన తెలుగుదేశం ఆఫీసులో కూర్చొని నాగూర్చి మాట్లాడతాడా? సైకిల్ మీద తిరిగే ఆయనకు 180కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయి. కాంట్రాక్టర్లను బెదరించి చిల్లర వసూలు చేసుకొంటుంటాడు. నాకే 20లక్షల రూపాయల పైబడి బాకీ వున్నాడు. అతనా నన్ను విమర్శించేదనేసరికి సోమిరెడ్డి గతంలోలా కాకుండా కాస్త స్వరం తగ్గించుకోక తప్పలేదు.

# ముదివర్తిలో పెత్తందారుదే పెత్తనం!

విడవలూరు మండలం ముదివర్తి గ్రామ పంచాయితీలో బినామీ నేతల హవా కొనసాగుతుంది. ఈ గ్రామ పంచాయితీకి సర్పంచ్‌గా మహిళ ఎన్నికైనప్పటికీ వ్యవహారం మొత్తం గ్రామంలోని పెద్దరెడ్డి నడిపిస్తుంటాడు. సర్పంచ్ కేవలం సంతకాలు చేసేందుకు మాత్రమే పరిమితమై పోయింది. ప్రభుత్వ నిధులతో పంచాయితీ పరిధిలో ఏ పని చేపట్టాలన్నా, సంక్షేమ పథకాల మంజూరుకు లబ్దిదారుల ఎంపిక జరగాలన్నా సర్పంచ్ ప్రమేయం ఏమాత్రం వుండదు. ఇదే గ్రామంలో పెద్దరెడ్డిగా పిలిచే కొండూరు వెంకటసుబ్బారెడ్డి చెప్పిన విధంగా అధికారులు నడుచుకుంటుంటారు.

ముదివర్తి గ్రామ పంచాయితీ పరిధిలో 1800 కుటుంబాలు, ఏడువేల జనాభా, ఐదువేల మంది ఓటర్లు వున్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా చిరువెళ్ల హైమావతిని ప్రజలు గెలిపించారు. అయితే ఈమె ఎప్పుడూ పంచాయితీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండదనే అపవాదు వుంది. ప్రజలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు అనధికార సర్పంచ్‌గా వుంటున్న కొండూరు వెంకటసుబ్బారెడ్డి వద్దకు వెళ్లి విన్నవించుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది. ప్రస్తుతం పంచాయితీలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, ఇందిరమ్మ గృహ నిర్మాణం, గతంలో సంభవించిన వరదలకు ప్రభుత్వం అందించిన వరద సహాయం మొత్తం వెంకటసుబ్బారెడ్డి స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందిరమ్మ గృహాలు పూర్తికాకుండానే పూర్తిచేసినట్లు బిల్లులు తయారు చేయించి లబ్దిదారులకు తెలియకుండా స్వాహా చేశాడు. ఇందుకు మండల ఎఇని ఉన్నతాధికారులు సస్పెండ్ కూడా చేయడం జరిగింది. పంచాయితీ పరిధిలో చేపట్టిన పనులను కూడా బినామీ సర్పంచ్ చేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతుంటాడు. ఎస్ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు ఎన్ని విడుదలయ్యాయో కూడా చెప్పే దిక్కు లేకుండా పోయింది.



ముదివర్తి గ్రామ పంచాయితీ కార్యాలయం.

### నిధులు దుర్వినియోగం!



పంచాయితీ పరిధిలో చేపట్టే పనులను బినామీ సర్పంచ్‌గా వుంటున్న కొండూరు వెంకట సుబ్బారెడ్డి చేస్తుంటాడు. సర్పంచ్ హైమావతి కేవలం సంతకాలకే పరిమితమైపోయింది. గ్రామంలో ప్రతిపనికి బినామీ సర్పంచ్ దగ్గరకు వెళ్లాల్సి వుంటుంది. ప్రజలు మంచినీరు దొరక్క ఉప్పునీరు త్రాగుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి పంచాయితీ పరిధిలో చేపట్టే పనులు, నిధుల ఖర్చుపై విచారణ చేయాలి.

– షేక్ ఖాజారంతుల్లా

### త్రాగునీరు సరఫరా చేయాలి!



గ్రామంలో త్రాగునీరు దొరక్క ఉప్పు నీటిని త్రాగుతున్నాం. గ్రామానికి చుట్టుప్రక్కల రొయ్యల గుంటలు ఏర్పాటు చేయడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి ఉప్పునీరు వస్తుంది. పంచాయితీ సర్పంచ్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం వర్షాకాలంలో ఉప్పునీరు త్రాగడం వల్ల అనారోగ్యం పాలయ్యే అవకాశం వుంది.

– టి.శ్రీనివాసులు

ఈ పంచాయితీలో త్రాగేందుకు త్రాగునీరు దొరక్క ప్రజలు నానా అవస్తలు పడుతున్నారు. ఉప్పు నీరు త్రాగాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనున్న పెన్నానదిలోకి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నామని వారు చెబుతున్నారు. పంచాయితీకి ఇసుక రీచ్‌ల నుంచి ప్రతి సంవత్సరం 11లక్షలకు పైగా నిధులు అందుతున్నా వీటిని కూడా బినామీ సర్పంచ్ ఖర్చు చేస్తుంటాడు. ఉన్నతాధికారులు ఈ పంచాయితీపై దృష్టిసారించి నిధుల ఖర్చుకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ జరిపితే అవినీతి, అక్రమాలు బయటపడతాయి.

ఈ నేపథ్యంలో పంచాయితీ పరిధిలోని సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.

అవినీతి కథ

# పర్యవేక్షణలేని బోగస్ రేషన్‌కార్డులసర్వే!

**జిల్లాలో జరుగుతున్న బోగస్ రేషన్‌కార్డుల సర్వే తూతూమంత్రంగా సాగుతోంది. చాలా చోట్ల సర్వే అధికారులకు డీలర్లే మార్గదర్శనం చేస్తున్నారు.**

జిల్లావ్యాప్తంగా గత నెల నుంచి బోగస్ రేషన్‌కార్డుల సర్వే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్వే కార్యక్రమానికి రెవెన్యూ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సిబ్బందిని నియమించారు. అయితే ఈ సిబ్బందికి సర్వేచేసే విధానం పట్ల పూర్తి అవగాహన లేకపోవడంతో ఆశించినవిధంగా కార్యక్రమం ముందుకు సాగడం లేదు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఇంటింటా సర్వే చేయాల్సి వుండగా కొన్ని గ్రామాలలో రేషన్‌షాపు డీలర్లపై పూర్తిగా ఆధారపడుతున్నారు.

తొలివిడతలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో వుంచుకుని రెండవ విడతలో ఇందుకు భిన్నంగా వ్యవహరించిన సర్వే బృందం నిబంధనలకు తిలోదకాలిచ్చింది. రేషన్‌కార్డుల సర్వే బృందం పనితీరును నిత్యం మండలస్థాయి రెవిన్యూ అధికారులు పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం సూచించినా ఈవిధంగా ఎక్కడా అధికారులు పర్యవేక్షణ చేసిన దాఖలాల్లేవు. రెవిన్యూ డివిజనల్ అధికారులు కొన్ని మండలాల్లో ఆకస్మికంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సర్వేబృందం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంది.

జిల్లాలో వున్న కుటుంబాలకు మించి రేషన్‌కార్డులు జారీచేసి వున్న విషయం ఇదివరకే ప్రభుత్వం గుర్తించింది. రెండవ విడత 14 మండలాల్లో నిర్వహిస్తున్న రేషన్‌కార్డుల సర్వే తూతూమంత్రంగా జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలోని రేషన్‌షాపు డీలర్ల వద్దనే అధికంగా బోగస్ కార్డులు వున్నాయి. వీటి ఆధారంగా ప్రతినెల రేషన్ సరుకులు తీసుకొచ్చి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము గడిస్తుంటారు. తమ వద్ద వున్న బోగస్ కార్డులు బయటపడకుండా వుండేందుకు సర్వే బృందం గ్రామాలకు వచ్చినప్పుడు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.

మరికొంతమంది రేషన్‌షాపు డీలర్లు మరో అడుగు ముందుకేసి ఎంతో కొంత నగదు సర్వే బృందం చేతుల్లో పెడుతున్నారు. ఈ వ్యవహారం ఎక్కువగా మెట్టప్రాంత మండలాల్లో చోటుచేసుకొంటుంది. ఎందుకంటే ఈ ప్రాంతాల్లో రేషన్‌కార్డులు పొందినవారు జీవనాధారం కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతుంటారు. వలసబాట పట్టిన వారికి సంబంధించిన రేషన్‌కార్డులు స్థానిక రేషన్ షాపు డీలర్ల వద్దనే వుంచుకుంటారు. ఇవికాకుండా చనిపోయిన వారిపేర్ల మీద వున్న రేషన్ కార్డులు కూడా వున్నాయి. దీంతో బండారం బయటపడకుండా వుండేందుకు చేతులు తడుపుతున్నారు.

రెండవ విడత సర్వే కార్యక్రమంలో 14 మండలాల్లో 268 మంది సిబ్బంది పాల్గొన్నారు. కావలి డివిజన్‌లో ఈ సర్వే కార్యక్రమం నామమాత్రంగా జరిగింది. రెండు లక్షల ఏడువేల కార్డులపై సర్వే జరగ్గా వీటిలో లక్షా తొంభైవేల ఐదు వందల రేషన్‌కార్డులను సర్వే బృందం పరిశీలించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా దాదాపు 20వేలకు పైగా బోగస్ కార్డులు స్వచ్ఛందంగా అందజేయడం జరిగింది. సర్వే బృందం పరిశీలనలో



గందరగోళంగా సర్వే చేపడుతున్న జిల్లా పౌరసరఫరాల కార్యాలయం.

ఎన్ని బోగస్ కార్డులను గుర్తించారన్న సమాచారం పౌరసరఫరాల శాఖ అధికారుల వద్ద లేకపోవడం విశేషం.

సర్వే సక్రమంగా జరగలేదని ఎవరైనా ఫిర్యాదులు చేస్తే ఆయా మండలాల్లో తిరిగి సర్వే చేయిస్తామని కూడా అధికారులు చెబుతున్నారు. మొత్తం సర్వే కార్యక్రమం పూర్తయిన తర్వాతగానీ జిల్లా జనాభాకు మించి కార్డులు వున్నాయా, లేదా అన్ని విషయం తెలియదు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బోగస్ రేషన్‌కార్డులను ఏరివేయాలని తీసుకున్న నిర్ణయం కొంతమంది అవినీతి అధికారుల కారణంగా నెరవేరకుండా పోయే ప్రమాదం ఏర్పడడం శోచనీయం.

# కుర్రాడు 'బలహీనం'



అల్లూరు రహీం

ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై జెమిని టి.వి అధినేత పి.కిరణ్ సందీప్ గుణ్ణంను దర్శకునిగా పరిచయం చేస్తూ తీసిన చిత్రమే కుర్రాడు. పేరుకు తగ్గట్టుగా ఈ చిత్రంలో పసలేదు. దర్శకుడి అవగాహనా రాహిత్యం చాలా సన్నివేశాల్లో కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఇటీవల విడుదలై విజయం సాధించిన 'రైడ్' చిత్రం సందీప్ గుణ్ణంకు నచ్చినట్లుంది. అదే విధంగా మగధీర చిత్రంలో హీరోయిన్‌ను హీరో బస్టాపు వద్ద పరిచయం చేసుకొనే సన్నివేశం బాగా తలకెక్కినట్లుంది. ఈ రెండు చిత్రాల నేపథ్యంలో కుర్రాడు కథను అల్లుకొని దానిలో కాస్త మాఫియా ముఠా కదలికలను జతకలిపాడు. హ్యాపీడేస్, కొత్తబంగారులోకం చిత్రాలతో లవర్‌బాయ్‌గా గుర్తింపు తెచ్చుకొన్న వరుణ్ సందేశ్ కుర్రాడు చిత్రంలో చలాకీగా కనపడలేదు. ముఖ్యంగా పోరాట సన్నివేశాల్లో పేలవమైన నటనను ప్రదర్శించాడు. చిరుత చిత్రంలో యువ ప్రేక్షకుల హృదయాలను దోచుకొన్న హీరోయిన్ నేహాశర్మకు కుర్రాడులో నిస్సారమైన పాత్ర దొరికింది. పాటలకే ఆమె పరిమితమైనా ఆ పాటలను సైతం దర్శకుడు సరిగ్గా తీయలేకపోయాడు. 30 ఏళ్ల క్రితం విడుదలైన 'అందమైన అనుభవం' చిత్రంలోని కుర్రాళ్లోయ్... కుర్రాళ్లు పాటను రీమిక్స్ చేసినా దాని చిత్రీకరణ పేలవంగా వుంది. సంగీత దర్శకుడు అచ్చు వాయిద్యాల ధ్వనిలో అనంత శ్రీరాం సాహిత్యం ఖూనీ అయ్యింది. రొటీన్ పాటలకన్నా దర్శకుడు రాజా రాజా ఐటెం పాటను బాగా చిత్రీకరించాడు. హీరోకు హీరోయిన్ నడివీధిలో ముద్దిచ్చే సన్నివేశం సహేతుకంగా లేదు. ఈ మధ్యే కామెడీ యాక్టర్‌గా రాణిస్తున్న వేణుకు ఈ చిత్రంలో మంచి క్యారక్టర్ దొరికింది. ఈచిత్రంలో డైలాగులు కాస్త పెడసరంగానే వున్నాయి. కొడుకు బాగుచూడని తండ్రికి అడిగే హక్కు లేదు. పరుగెత్తిపాలు తాగడంకన్నా కూర్చుని క్వార్టర్ తాగడం మంచిది. లైన్ వేసావు కదా... లైన్‌లో లేకుండా పోతామా ఈ కోవలోనివే.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే మధ్యతరగతి కుటుంబీకులైన తనికెళ్ల భరణి, ప్రగతి దంపతుల కుమారుడైన వరుణ్(వరుణ్‌సందేశ్) ఎంసిఏ చదువుకొని నిరుద్యోగిగా వుంటాడు. ఇతనికి రెండు కోర్కెలుంటాయి. ఒకటి బైక్ కొనాలి. దానిపై ప్రియురాలిని కూర్చోబెట్టుకొని తిరగాలి. ఒకరోజు తండ్రి జేబులో వెయ్యి రూపాయలు కొట్టేసి స్నేహితులకు డాబా దగ్గర పార్టీ ఇచ్చిన వరుణ్‌ను తండ్రి మందలిస్తాడు. దీంతో వరుణ్ తండ్రిపై తిరగబడతాడు. తండ్రులు తమ బిడ్డలకు ఆసరాగా నిలబడితే ఎదుగుతారంటాడు. దీంతో కలత చెందిన తనికెళ్ల భరణి కుమార్తె పెళ్లికోసం దాచిన 70 వేలు అతనికి ఇస్తాడు. ఈ డబ్బుతో బైక్ కొన్న వరుణ్, బస్టాపులో వుండే హేమ(నేహాశర్మ) దగ్గ రకు వెళ్లి ఆమెకు సైట్ కొట్టనారంభిస్తాడు. బైక్ వుండడం వల్ల ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో వరుణ్‌కు రికవరీ ఏజెంట్ ఉద్యోగం వస్తుంది. దీంతో ప్రేయసి కూడా అతని బైక్ ఎక్కేస్తుంది. వరుణ్ వాళ్లుండే బస్తీలో దందాచేసే సత్య(బొమ్మాళి రవి) సోదరుడు రవి అనవసరంగా తనికెళ్లపై చేయిచేసుకోవడంతో వరుణ్ అతన్ని పబ్లిక్‌గా కొట్టడంతో అతను ఫీల్ అయ్యి కసి పెంచుకొంటాడు. హేమ-వరుణ్ గల్లీలో ముద్దుల్లో మునిగివుండగా ఆ ప్రాంత కార్పొరేటర్‌ను సత్య మనుషులు హత్య చేయడంతోపాటు హీరో బైక్‌ను పట్టుకపోతారు. అక్కడి నుంచి వరుణ్‌కు కష్టాలు మొదలవుతాయి. బైక్‌పై విపరీతంగా అభిమానం పెంచుకొన్న వరుణ్ దానికోసం పోలీస్ స్టేషన్ నుంచి బైక్‌ల దొంగల వద్దకు కూడా వెళ్తాడు. బైక్‌ను దొంగిలించినవాళ్ల దానిలో రవి సలహామేరకు మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ చేస్తారు. పోలీసులు ఈ వ్యవహారంలో వరుణ్‌ను ఇంటరాగేషన్ చేస్తారు. తనతో ఊరకే గొడవపడుతుండే రవి విషయాన్ని అతని సోదరుడు సత్యకు వరుణ్ ధైర్యంగా వెళ్లిచెబుతాడు. దీంతో అతను రవిని పదిమంది ముందు మందలిస్తాడు. దీన్ని తట్టుకోలేక పోయిన రవి మాఫియాసేట్(దర్శకుడు శరత్) సహకారంతో సత్యను చంపిపారేసి, వరుణ్ కోసం బయలుదేరుతాడు. సత్యను మరెవరైనా చంపారని భావించిన అతని మరో ముఖ్య అనుచరుడు బుల్లెట్ నగరంలోని గల్లీ రౌడీలందరినీ కసకసపొడుచుక వెళ్తాడు. అంతిమంగా వరుణ్, రవి కలియబడతారు. తన పాలిట విలన్‌గా మారిన రవిని వరుణ్ అంతమొందించడంతో చిత్రం పరిసమాప్తమవుతుంది.

హీరో వరుణ్‌సందేశ్ నటన ప్రతి చిత్రంలోనూ రొటీన్‌గా తయారవుతుంది. అరుంధతి చిత్రంలో మాంత్రికునికి డబ్బింగ్ చెప్పి పాత్రకు ప్రాణం పోసిన బొమ్మాళి రవి ఈ చిత్రంలో విలన్‌గా రాణించలేకపోయాడు. కొడుకు సందీప్‌ను ప్రమోట్ చేయను నిర్మాత గుణ్ణం గంగరాజు మరో ప్రయత్నం చేయక తప్పదు.

## రెచ్చిపోయిన ఐశ్వర్య



విశ్వసుందరి ఐశ్వర్యరాయ్ తొలిసారిగా తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలసి రోబో చిత్రంలో నటిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పలు అందమైన లొకేషన్లలో ఈ చిత్రం షూటింగ్ జరిగింది. వివాహానికి ముందు ధూమ్-2 చిత్రంలో తన అందాలను ఆరబోసిన ఐశ్వర్య ఇప్పుడు వివాహానంతరం రోబోలో మితిమీరిన అందాలను ప్రదర్శించనుంది. గతంలో శంకర్ దర్శకత్వంలో జీన్స్‌లో నటించిన ఐశ్వర్యను రోబోలో జీన్స్ చిత్రం కంటే మరింత అందంగా చూపించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడన్నది సమాచారం.

## మిర్చి పాపగా నీతూ



హీరో రాజశేఖర్ తనతో అతిగా ప్రవర్తించాడని హీరోయిన్ నీతూ చంద్ర గొడవ చేసినప్పటి నుంచి తెలుగు నిర్మాతలెవరూ ఆమెకు అవకాశలివ్వలేదు. కాని తమిళంలో విశాల్ సరసన నీతూ ఓ చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాలో ఓ పాట చిత్రీకరణలో దర్శకుడు నీతును ఎర్ర మిరపకాయలలో ముంచాడు. సినిమాలో ఆమె మిరపకాయల స్నానం చేస్తుంది. నీతూ అందాలను ఎర్రటి మిరపకాయలతో పూరించే ప్రయత్నమిదని దర్శకుడు చెబుతున్నాడు. వార్తల్లో వ్యక్తిగా కనబడేందుకు చెన్నై పబ్‌లలో జరిగే పార్టీలకు నీతూ తెగ హాజరవుతుంది.

## కాజల్ కావాలి...



తెలుగు పరిశ్రమలో సీనియర్ హీరోల ఫేవరేట్ హీరోయిన్ అనుష్క కాని యువహీరోలంతా కాజల్‌నే తమ సరసన నటించాలని కోరుకొంటున్నారు. ఒక దశలో హన్సిక అంటే కొందరు యువహీరోలు క్రేజీగా ఫీలయ్యారు. కాని ఆమె పెడసరం వాళ్లను బాధించింది. అదే కాజల్ అయితే ఫ్రెండ్లీగా వ్యవహరిస్తుందంటున్నారు. ఆమె కలుపుగోలుతనంతో కలసిపోతుంది. పైగా కాజల్ తల్లి కూడా యువహీరోలను తరచూ తన ఇంటికి పిలిచి పార్టీలిస్తుంటుంది. దీంతో పలువురు హీరోలు కాజల్‌ను తమ సరసన హీరోయిన్‌గా పెట్టమంటూ నిర్మాతలను ఒత్తిడి చేస్తున్నారు. మగధీర హిట్ తర్వాత కాజల్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ అయిపోయింది.

## భర్తకు దూరంగా ఆర్తి!



హీరోయిన్‌గా తన కీర్తి తెలుగుపరిశ్రమలో రెపరెపలాడుతున్నప్పుడు ఆర్తి అగర్వాల్ తరుణ్‌తో ప్రేమలో పడింది. కాని తరుణ్ తల్లి రోజారమణి వీరిద్దరి ప్రేమను ఒప్పుకోకపోవడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. ఇంతలో తలకు దెబ్బతగలడంతో అమెరికా వెళ్లిపోయి ఓ ఎన్‌ఆర్‌ఐని పెళ్లి చేసుకొంది. కాని ఈ సంసారబంధం సజావుగా సాగలేదు. ప్రస్తుతం పోసాని జెంటిల్‌మెన్ చిత్రంలో నటిస్తున్న ఆర్తి తన పూర్వ అందాలను పొందడానికి వ్యాయామాలు గట్రా చేస్తుంది. హైదరాబాద్‌లోనే వుంది. సినిమాల్లో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తానని చెబుతున్న ఆర్తి దీనికి ప్రతిబంధకంగా వున్న భర్తకు దూరమవ్వాలని యోచిస్తున్నదట.

సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్ నిర్వాహకుల నిర్వాకం

# పంట కాల్వలను పాడుచేస్తున్నారు

నెల్లూరు నగరంలో సెప్టిక్ ట్యాంకులు నిండిన వెంటనే గంటలో శుభ్రపరిచే పరికరాలు అందుబాటులోనికి వచ్చాయి. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వ్యాపారం నగరంలో బాగానే నడుస్తుండడంతో 20కిపైగా ట్యాంకుల క్లీనింగ్ వాహనాలు రోడ్లలో తిరుగుతూ కనిపిస్తున్నాయి. మునిసిపల్ శానిటరీ కార్మికులు ట్యాంకులు శుభ్రపరిచే సమయంలో తీసే అశుద్ధాన్ని చెత్త డంపింగ్ యార్డులలో లేదా ఊరికి దూరంగా వేసేవారు. కానీ ప్రస్తుతం సెప్టిక్‌ట్యాంకులు శుభ్రపరుస్తున్న వాహన యజమానులు రాత్రివేళల్లో ఈ అశుద్ధాన్ని నగరంలోని పంట కాల్వలలో వదిలేస్తున్నారు. నగరంలో పారుదల వుండే సర్వేపల్లి కాలువతోపాటు ఒకటి రెండు పంట కాల్వలలో బట్టలు ఉతకడం రివాజు. ఈ కాల్వలలో పిల్లలు ఈత కూడా కొడుతుంటారు. పంట పొలాల దగ్గర ఈ నీటిని తాగేవారున్నారు. దీని మూలంగా చర్మ వ్యాధులతోపాటు రకరకాల కొత్త రోగాలను జనం తెచ్చుకొంటున్నారు. సెప్టిక్‌ట్యాంకుల వ్యర్థాలను కాల్వలలో వదలకుండా చూడాల్సిన బాధ్యత తమది కాదని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ఆంజనేయులు చెప్పి తప్పించుకో చూస్తున్నాడు. ఈ వ్యవహారాన్ని పిడబ్ల్యుడి అధికారులు చూసుకోవాలంటున్నారాయన. పిడబ్ల్యుడి అధికారుల మాటను సెప్టిక్‌ట్యాంకులు శుభ్రపరిచే వాహనాల యజమానులు వింటారా?

# రొయ్యల తూకాల్లో దగా

హరనాథపురం మార్కెట్‌లో మోసాలు



పండించిన పంట, తయారుచేసిన వస్తువులను గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని ప్రతిఒక్కరూ భావిస్తారు. మార్కెట్ రేటు కన్నా అదనంగా పది రూపాయలు ఇస్తామంటే అందరూ అక్కడికే పరుగు పెడతారు. ఈ పది రూపాయలు ఎరగావేసి నెల్లూరు హరనాథపురం ప్రాంతంలో హోల్‌సేల్‌గా రొయ్యలు, చేపలుకొనే వ్యాపారస్తులు మత్స్యకారులను, రొయ్యల రైతులను మోసగిస్తున్నారు. చూపుడుకు పదికిలోల రాయిగా కనపడుతుంది. కానీ వాస్తవంగా దాని బరువు ఎనిమిది కిలోలే. ఇటువంటి రాళ్లతో హరనాథపురంలోని హోల్‌సేల్ చేపలు, రొయ్యల వ్యాపారులు మహాదర్జాగా వ్యాపారం చేసేస్తున్నారు. చీకటిపడి సరుకు తెస్తుండడంతో మసక చీకటిలో తూకం మాటున మోసాన్ని గ్రహించలేక పోతున్నారు. దీనికితోడు కిలోకు పది రూపాయలు ఎక్కువగా ఇస్తున్నట్లు ఇక్కడి వ్యాపారులు ఫోజులిస్తుండడంతో వీరిని నమ్మి మోసపోతున్నారు. ఈ సెంటర్‌లో ప్రతి సాయంత్రం ఎంత తక్కువ అనుకున్నా పది నుంచి ఇరవై లక్షల మేర రొయ్యలు, చేపల అమ్మకం, కొనుగోళ్ల వ్యాపారం జరుగుతుంది. ఇక్కడి నుంచి చెన్నై, బెంగుళూరు, కలకత్తాలకు రొయ్యలు, చేపలు ఎగుమతి చేస్తారు. పదేళ్లుగా ఈ వ్యాపారం నడుస్తున్నా తూనికలు, కొలతల శాఖాధికారులు ఈ ప్రాంతానికి ఒక్కసారి కూడా వెళ్లలేదంటే వీరెంత బాగా విధులు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన నిడిగుంటపాళెం జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ కె.రవీంద్రారెడ్డికి హైదరాబాద్‌లో అవార్డును అందజేస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య. ప్రక్కన రాష్ట్ర మంత్రులు శ్రీధరబాబు, అహ్మదుల్లా, మాణిక్య వరప్రసాద్.



నెల్లూరులోని దేవాదాయశాఖ కార్యాలయం.

• దేవుడి ఆస్తిపాస్తులకు రక్షకులెవరు?

# దేవాదాయ శాఖలో ఆడిట్ లేదు

దేవాదాయ, ధర్మాదాయ శాఖ నేతృత్వంలో నడిచే దేవాలయాల్లో ఆదాయ, వ్యయాలపై ఆడిటింగ్ జరిగి పదేళ్లకు పైబడింది. దీనివల్ల దేవుళ్ల ఆస్తులు, నగలు, ఆదాయాలపై పలు సందేహాలు కలుగుతున్నాయి. నగరంలో ఆదాయం బాగుండే రంగనాథస్వామి, వేణుగోపాలస్వామి, రాజరాజేశ్వరమ్మ దేవస్థానాల్లో విపరీతంగా ఆర్జిత సేవలు, కానుకలు, హుండీల లెక్కింపుల్లో నొక్కుడు జరుగుతుంది. జిల్లాలోని మిగతా దేవాలయాల్లో ఈ దోపిడీ తీవ్రరూపం దాల్చి వుంది. దేనికీ లెక్కాపక్కా లేదు. అదేమంటే ఉభయకర్తలు విరాళంగా ఇచ్చిన మొత్తాలతో వార్షిక బ్రహ్మోత్సవాలు, రోజువారీ పూజలు, పునస్కారాలు, దీప, ధూప, నైవేద్యాలను నెట్టుకొస్తున్నట్లు పూజారులు, దేవాదాయ శాఖాధికారులు చెప్పుకొస్తున్నారు. జిల్లాలో పలు దేవస్థానాలకు వందల ఎకరాల్లో ఆస్తులున్నాయి. కానీ వీటిపై రావాల్సిన ఆదాయం నామమాత్రంగా వుంటుంది. ఈ మధ్య జిల్లాలోని దేవస్థానాలకు భక్తులు బాగానే వెళ్తున్నారు. హుండీ ఆదాయాలు, కానుకలుగా ఇచ్చే మొత్తాలు పెరిగినా వీటిని ఎప్పటికప్పుడు బహిరంగపర్చవలసిన సిబ్బంది ఆ పని చేయడం లేదు. ఈ వ్యవహారాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన దేవాదాయ, ధర్మాదాయ శాఖలోని ఆడిటింగ్ విభాగం ఆ పనే చేయకుండా గమ్మునుండడం ఆశ్చర్య పరుస్తుంది. లక్షల మంది జనానికి ఆరాధ్యనీయులైన దైవాల ఆస్తులు జిల్లాలో హారతి కర్పూరం కావడం విచారించతగ్గ విషయం.

• డిటిసిపి అనుమతులు లేకుండా అమ్మకాలు

# ప్లాట్లు కొంటే పాట్లే

నెల్లూరు రూరల్ మండల పరిధిలోని పొట్టేపాళెం - జొన్నవాడ గ్రామాల మధ్య డిటిసిపి అటుంచి, పంచాయితీ సర్వసభ్య సమావేశాల్లో అప్రూవల్ లేని లేఅవుట్లలో ప్లాట్ల అమ్మకాలు ఊపందుకొన్నాయి. బ్రోకర్ల మాయమాటలు, భవిష్యత్తులో స్థలాలు దొరకవన్న ప్రచారంతో ఇరుగాళమ్మ గుడి వద్ద నుంచి జొన్నవాడ వరకు 33 అంకణాల స్థలం ఆరు నుంచి పది లక్షల రూపాయల మేర అమ్ముతున్నారు. వీటివల్ల గ్రామపంచాయితీలకు పైసా ఆదాయం రాకపోవడంతో వీటిలో కనీస సౌకర్యాల కల్పనకు పంచాయితీలు ముందుకు రావడం లేదు. పొట్టేపాళెం వద్ద రోడ్డు ప్రక్కన ఎకరా స్థలం 80 లక్షల నుంచి కోటి రూపాయల పైబడి ధర పలుకుతుంది. డిటిసిపి, ఇతర అనుమతులు తీసుకోవాలంటే పది ఎకరాల స్థలంలో ఎకరా స్థలం కోల్పోవాల్సి వస్తుంది. దీనివల్ల కోటి రూపాయల మేర నష్టమొస్తుందని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అనుమతులేవీ తీసుకోకుండా తెలివిగా ఈ స్థలాలను అమ్మేస్తున్నారు. తాము రిజిస్ట్రేషన్ చేస్తున్న స్థలాలకు సంబంధించిన రికార్డులు పక్కాగా వున్నాయా? లేదా? అనే విషయం కూడా రిజిస్ట్రేషన్ చేసే అధికారులు చూడకపోవడం వల్ల అంతిమంగా వీటిని కొన్నవారు భవిష్యత్తులో నానా పాట్లు పడవలసి వస్తుంది. ప్రభుత్వం అనుమతులు లేని స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆపితే గానీ ఈ దోపిడీ ఆగదు.



# ఓబుళాపురం గనుల్లో అక్రమాలపై విచారణ చేయాలి!

ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో అనేక అక్రమాలు జరుగుతున్న సంఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షపార్టీలు ఈ నెల 16వ తేది ఆందోళన కార్యక్రమం చేపట్టాయి. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ, లోక్‌సత్తా పార్టీల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పై పార్టీల కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష పార్టీలు.

ఓబుళాపురం మైనింగ్ కంపెనీ నిర్వాహకుడు గాలి జనార్దనరెడ్డి కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని ధన బలంతో శాసిస్తున్నాడని అఖిలపక్ష నేతలు ఆరోపించారు. కోట్ల రూపాయల విలువ చేసే ఐరన్‌ఓర్‌ను విదేశాలకు తరలించి వేలాది కోట్ల రూపాయలను ఆర్జిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి కేవలం నామమాత్రపు పన్నులనే చెల్లిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో కొందరి పెద్దల సహకారంతో గాలి సోదరులు ఐరన్‌ఓర్‌ను రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. మైనింగ్ కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. గనుల శాఖ కేటాయించిన ప్రాంతంలోనే కాకుండా సమీప ప్రాంతాల్లోని గనుల నుంచి కూడా ఇనుప ఖనిజాన్ని అక్రమంగా త్రవ్వి సొమ్ము చేసుకుంటున్న విషయం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు రేపింది. ప్రకృతిపరంగా లభించే వనరులు చాలా పరిమితంగా వుంటాయి. వీటిని మన రాష్ట్ర అవసరాలకు వినియోగిస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, విదేశాలకు ఎగుమతి చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఓబుళాపురం నుంచి ఐరన్‌ఓర్ తీసుకొని కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే భారీవాహనాలు ఢీకొట్టి ఇప్పటివరకు 300 మంది జిల్లావాసులు దుర్మరణం చెందారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో జరుగుతున్న అక్రమాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై అఖిలపక్ష నాయకులు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.



### గనుల కేటాయింపు రద్దుచేయాలి!

గాలి సోదరులకు కేటాయించిన ఓబుళాపురం ఇనుప ఖనిజం గనులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి. ప్రజల ఆస్తి అయిన ఖనిజ సంపద నిర్వహణ, నియంత్రణ ప్రభుత్వ అజమాయిషీలో జరగాలి. రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దల సహకారం వుండడం వల్ల మైనింగ్ కంపెనీ యజమానులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.

ఎం.మోహన్‌రావు,
సిపిఎం నగరకార్యదర్శి.



### ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి!

గాలి సోదరులకు కేటాయించిన ఓబుళాపురం ఇనుప ఖనిజం గనులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి. ప్రజల ఆస్తి అయిన ఖనిజ సంపద నిర్వహణ, నియంత్రణ ప్రభుత్వ అజమాయిషీలో జరగాలి. రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు పెద్దల సహకారం వుండడం వల్ల మైనింగ్ కంపెనీ యజమానులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.

కిలారి వెంకటస్వామినాయుడు,
టిడిపి నగరాధ్యక్షుడు.



### అక్రమాలపై విచారణ జరపాలి!

ఓబుళాపురం ఇనుప ఖనిజం గనులలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. మైనింగ్ కంపెనీలలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్న విషయంపై ప్రభుత్వం ఇప్పటి వరకు సమగ్ర విచారణ జరపకపోవడాన్ని బట్టి చూస్తే ఇందులో పెద్దల హస్తం వుందని అనుమానించాల్సి వుంటుంది.

వి.రామరాజు,
సిపిఐ నాయకుడు.



# బాలల చలన చిత్రోత్సవంలో ఆలోచింపజేసే చిత్రాల ప్రదర్శన!

జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితి. ఈ ఏడాది నగరంలో వివిధ కార్యక్రమాలతోపాటు అంతర్జాతీయ బాలల చిత్రాలను ప్రదర్శించడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కస్తూరిబా కళాక్షేత్రం ఈ ప్రదర్శనలకు వేదికయ్యింది. అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు, విమర్శకుల మన్ననలు అందుకొన్న చిత్రాలను ఇక్కడ ప్రదర్శించారు. బెన్స్ స్కూలు నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకురావడంతో నగరవాసులకు పలు విదేశీ చిత్రాలను తిలకించే అవకాశం లభించింది. ఇరాన్, ఫ్రాన్స్, చైనా, కొరియా దేశాల చిత్రాలను ప్రదర్శించారు. ఈ చిత్రోత్సవంలో పిల్లల భావోద్వేగాలు, వారి పసిమనసులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఒత్తిడి వారిపై చూపే ప్రభావం, సమాజ పరిస్థితులు ఏవిధంగా మనిషిని ప్రభావితం చేస్తాయి. తదితర అంశాలు పలు చిత్రాలలో ప్రతిఫలించాయి. ఫాదర్ అనే ఇరాన్ సినిమా పసి హృదయాలను ఇంటి వాతావరణం, తల్లిదండ్రుల మధ్య ఏర్పడే మనస్పర్థలు ఎంతగా వేదనకు గురి చేస్తాయో తెలియజేసింది. 14 సంవత్సరాల బాలుడు తల్లిదండ్రుల మధ్య ఏర్పడిన గొడవల వలన తల్లి మరో పెళ్లి చేసుకొంటే క్రొత్త వ్యక్తిని తండ్రిగా చూడలేకపడిన బాధ, అనుభవించిన మానసిక సంఘర్షణను సెల్యూలాయిడ్‌పై హృద్యంగా చిత్రీకరించడం పలువురి మన్ననలు అందుకొంది. చిన్నప్పుడు తల్లిదండ్రులు, టీచర్లు పిల్లలను బెదిరించడం, కొట్టడం వలన వారిలో ఎలాంటి భయాందోళనలు కల్గుతాయో, ఎంతగా వణికిపోతారో ది చిల్డ్రన్స్ ఆఫ్ హెవెన్ అనే మరో చిత్రం చూపించింది. వీటితోపాటు వేరీజ్ ఫ్రెండ్ హోమ్, ది రెడ్ బెలూన్, ది ఐ హోమ్, తదితర సినిమాలు అటు పిల్లలను, ఇటు పెద్దలను విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమానికి ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా రీజనల్ సెక్రటరీ ప్రకాష్‌రెడ్డి, ఛైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ రాంగోపాల్, రూరల్, సిటీ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ, బెన్స్‌స్కూల్ కరస్పాండెంట్ అనితాపాల్, పాల్ కోటి తదితరులు పాల్గొన్నారు.


చలన చిత్రోత్సవాన్ని ప్రారంభిస్తూ జ్యోతివెలిగిస్తున్న కలెక్టర్.
బ్రోచర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు శ్రీధరకృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి, జె.సి. సౌరబ్‌గౌర్.



Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11



• పండిన మునిసిపల్ అవినీతిపాపం

# రోడ్డు డివైడర్ల దోపిడీపై సిబిసిఐడి దర్యాప్తు!



క్యూబిక్ మీటరుకు 4,500లు చెల్లించిన బండరాతి నిర్మాణం ఇదే.



నగరంలో ఎక్కడ చూసినా యుని యాడ్స్ ప్రకటనల బోర్డులే.

నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా నిర్మించిన రోడ్డు డివైడర్ల అవినీతిపై సిబిసిఐడి దర్యాప్తుకు ఆదేశాలిచ్చింది న్యాయస్థానం. సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టపగ్గాలులేని నెల్లూరు కార్పొరేషన్ అవినీతి విశృంఖలత్వానికి మొట్టమొదటి ఎదురుదెబ్బ ఇది.

నెల్లూరు నగరంలో ప్రధాన వీధులన్నిటిలో రోడ్డు డివైడర్లు, కూడళ్లలో ట్రాఫిక్ ఐల్యాండ్స్ నిర్మించారు. గాంధీబొమ్మ నుంచి విఆర్ కాలేజి వరకు, రామలింగాపురం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు కనకమహల్ సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు డివైడర్లు కట్టారు. గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, ఆనం వెంకటరెడ్డి బొమ్మలున్న కూడళ్లలో రోడ్లను దురాక్రమిస్తూ ట్రాఫిక్ ఐల్యాండ్లను నిర్మించారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఇష్టానుసారం జరిగాయి ఈ నిర్మాణాలు. ట్రాఫిక్ సౌకర్యం, ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా ఆయన ముచ్చటపడిన తీరులో డిజైన్ చేశారు. కొన్ని కోట్ల రూపాయలు క్రుమ్మరించారు. అయితే వాటికి ఒక లెక్కాపక్కా లేదు. కనీసపాటి నిబంధనలు కూడా పాటించలేదు. ఒకపక్క మునిసిపల్ నిధులు, ఎమ్మెల్యే గ్రాంటు నిధులు ఖర్చు చేస్తూ మరొకప్రక్క యుని యాడ్స్ అనే ప్రైవేటు ప్రకటనల సంస్థకు నిర్మాణాలు అప్పచెప్పారు. ఆ డివైడర్ల మీద ప్రకటనల బోర్డు అమర్చి నెలకు దాదాపు 12లక్షల 50వేల రూపాయలు దండుకొనే అధికారం కూడా ఆ సంస్థకే దఖలు పరిచారు.

ఎ.రాఘవరెడ్డి అనే శోధన్‌నగర్ నివాసి ఈ అవినీతి దుర్మార్గాన్ని ప్రశ్నిస్తూ కలెక్టర్, కార్పొరేషన్, ఆర్‌అండ్‌బి అధికారులకు సమాచార హక్కు చట్టం క్రింద లెక్కలేనన్ని ప్రశ్నలు సంధించాడు. అయితే ఏ అధికారి కూడా రోడ్డు డివైడర్ల నిధుల ఖర్చు గురించి సక్రమమైన సమాచారం ఇవ్వలేదు. ఎవరికివారు తమ బాధ్యత లేదని తప్పించుకొంటూ వచ్చారు. దీంతో విసిగిపోయిన రాఘవరెడ్డి నెల్లూరు కోర్టులో కేసు దాఖలు చేశాడు. దానిపై ప్రాథమికంగా విచారణ జరిపిన న్యాయమూర్తి అక్టోబర్ 30తేది సిబిసిఐడి దర్యాప్తుకు ఆదేశాలిచ్చాడు. తిరుపతి సిబిసిఐడి ఆఫీసుకు ఈ ఉత్తర్వులు అందాయి. దర్యాప్తు నివేదికను తన కోర్టుకే సమర్పించమని ఆదేశించాడు న్యాయమూర్తి.

త్రవ్వి తీయాలే కానీ, ఈ రోడ్డు డివైడర్ల నిర్మాణంలో ఒక అవినీతి గనే బయటపడుతుంది. ఎమ్మెల్యే, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు కలిసి నెల్లూరునగర ప్రజలను ఎంతగా నిలువు దోపిడీ చేస్తున్నదీ వెలికి వస్తుంది. ఒక్క ఆనం వెంకటరెడ్డి విగ్రహ కూడలి విషయం పరిశీలించినా, అవినీతి కంపుతో ముక్కుపుటాలు బ్రద్దలైపోతాయి. ఈ విగ్రహ కూడలి నిర్మాణానికి ఇటు మునిసిపాలిటీ అటు ఆర్‌అండ్‌బి విభాగాల నుంచి బిల్లులు తీసుకొన్నారు. కానీ దాన్ని కట్టించింది మాత్రం కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం. సాధారణంగా బండరాళ్లతో కట్టే నిర్మాణాలకు క్యూబిక్ మీటరుకు 2500 రూపాయలు చెల్లించాలన్నది ప్రభుత్వ నియమం. కానీ ఇక్కడ ఒక్కొక్క క్యూబిక్ మీటరుకు 4500 రూపాయల బిల్లు ఇచ్చారు. అదేమనిఅడిగితే, టిటిడిలో ఆ రేటు వుందని చెప్పాడు అప్పటి మునిసిపల్ కమీషనర్. టిటిడి అంటే, కొండ మీదకు రాళ్లు రవాణా

కొరవ 14వ పేజీలో






హృదయపూర్వక శుభాకాంక్షలు

అచిరకాలంలోనే... అతి చిన్నవయసులోనే...
రియల్‌ఎస్టేట్ రంగంలో అద్భుతాలు సాధించి,
అనితరసాధ్యుడనిపించుకున్న మా ఆత్మీయుడు,
అలయన్స్ గ్రూప్ ఛైర్మెన్
'మొగల్స్ ఆఫ్ రియల్ ఎస్టేట్' పుస్తక రచయిత
**శ్రీ మనోజ్ నంబూరు గారు**
అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎకనమిక్ టైమ్స్ వారి
'లీడర్స్ ఆఫ్ ఇండియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్'
అవార్డునందుకున్న శుభసందర్భంగా
మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

**సుధీర్ రాపర్ల,** M.B.A
కాలిఫోర్నియా, యు.ఎస్.ఏ.


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.